

కల్లు దుకాణాలకు
ఒంటరిగా వచ్చే మహిళలే టార్గెట్
- నగలు, నగదు కోసం హత్యలు
- ఇప్పటికే పలు హత్య కేసుల్లో జైలుకు
- నెల కిందనే తిరిగివచ్చి నర్సాపూర్‌లో ఘాతుకం
- మహిళ హత్య కేసులో దొరికిన సైకో

6

శోభాయమానం

హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా కాషాయమయమైన మెదక్ పట్టణం



మెదక్ అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జై శ్రీరాం.. జై హనుమాన్ నినాదాలతో మెదక్ మార్మోగింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో వీరహనుమాన్ విజయయాత్ర వైభవంగా నిర్వహించారు. హనుమాన్, శ్రీరాముడి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని రాందాస్ చౌరస్తా, పాత బస్టాండ్, ఆటోనగర్, న్యూమార్కెట్, పెద్దబజార్, పిట్లంబేస్, చమన్, హెడ్‌పోస్టాఫీస్ మీదుగా విజయ యాత్ర సాగింది. జిల్లా నలుమూలల నుంచి యువకులు, హనుమాన్ భక్తులు కాషాయ జెండాలు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించి ట్రాఫిక్‌ను మళ్లించారు. శోభాయాత్రలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడు

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన నిర్మలా జగ్గారెడ్డి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమానత్వానికి శాశ్వత ప్రేరణ అని, అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని అన్నారు. సమాజంలో వివక్షకు తావులేని సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ సంక్షేమాధికారి జగదీష్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్, వై.ప్రభు, మహేష్, మునిపల్లి సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహాత్మా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి కొత్తబస్టాండ్ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత

పొడిదగ్గుతో ఆస్పత్రికి..

జహీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హోతి(కే) గ్రామ శివారులోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు పొడిదగ్గుతో ఆస్పత్రిలో చేరారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శుక్రవారం రాత్రి ఒక్కసారిగా దగ్గుతో బాధపడ్డారు. ఎంతకూ దగ్గు తగ్గకపోవడంతో పాఠశాల సిబ్బంది వెంటనే వారిని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఏడుగురిలో నాగమణి, హర్షిత అనే విద్యార్థులకు దగ్గు అధికంగా ఉంది. దీంతో వారిని ఆస్పత్రిలో ఉంచి వైద్యం అందజేస్తున్నారు. ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందాక కోలుకున్నట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి బస్వరాజ్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఐదు నెలలు.. ఒకే కిలోమీటరు

..అదీ అంతంత మాత్రమే!

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఉన్నది సంగుపేట-అన్నాసాగర్ రోడ్డు విస్తరణ పనుల తీరు. పుష్కలంగా నిధులు అందుబాటులో ఉన్నా పనులు మాత్రం నత్తను తలపిస్తున్నాయి. 4.5 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు ఐదు నెలల క్రితం మంత్రి శంకుస్థాపన చేయగా.. ఇప్పటి వరకు కిలోమీటరు దూరం.. అదీ ఒకవైపు విస్తరణ పనులు చేపట్టారు. పనుల్లో తాత్సారంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినా కాంట్రాక్టు సంస్థ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



- నత్తనడకన సంగుపేట-అన్నాసాగర్ రోడ్డు విస్తరణ
- కొన..సాగుతున్న పనులు
- అందుబాటులో రూ. 20 కోట్ల నిధులు
- తాత్సారం చేస్తున్న కాంట్రాక్టు సంస్థ



రోడ్డు విస్తరణ శిలాఫలకం



పక్కన మట్టిని తవ్వేయడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

జోగిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అందోలు మండలం సంగుపేట వద్ద జాతీయ రహదారి వద్ద నుంచి అందోలు-జోగిపేట మున్సిపాలిటీ మీదుగా అన్నాసాగర్ వరకు (అంబేడ్కర్ విగ్రహం నుంచి సత్యసాయి కాలనీ వరకు మినహాయించి) 4.5 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించడం కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో ప్రభుత్వం రూ. 20 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతేడాది డిసెంబరు 5వ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా మంత్రి పనులను ప్రారంభించారు. హైవేపై సంగుపేట అండర్‌పాస్ చౌరస్తా నుంచి అందోలు రంగనాయక ఆలయం వరకు 2.8 కి.మీ. రోడ్డును తొలిదశలో విస్తరించాలని నిర్ణయించారు. కానీ, ఐదు నెలల్లో కేవలం ఒక కిలోమీటరు మేర మాత్రమే పనులు చేపట్టారు. అది కూడా రోడ్డుకు ఒక వైపు తవ్వేసి కంకర పోసి వదిలేశారు. అటువైపు పనులు చేయకుండానే మరోవైపు తవ్వేశారు. దీంతో, రోడ్డు ఇరుకుగా, గుంతలమయంగా మారింది. ఎదురుగా వాహనం వస్తే రోడ్డు దిగడానికి కూడా వీలులేకుండా పోయింది. రాత్రివేళ మరింత ప్రమాదకరంగా మారింది. కిలోమీటరు రోడ్డు దాటడానికి వాహనదారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇక మిగిలిన పనుల ఊసే లేదు. తొలిదశ పనులే ముందుకు సాగకపోతే ఇంకా రెండో దశ ఎప్పుడు ప్రారంభిస్తారు.. ఎప్పటికి రోడ్డు విస్తరణ పూర్తవుతుందని ప్రజలు వాపోతున్నారు.

జాప్యంపై మంత్రి ఆగ్రహం!

సంగుపేట-అన్నాసాగర్ రోడ్డు పనులకు నిధుల కొరత లేదు. పుష్కలంగా నిధులు అందుబాటులో ఉన్నాయి. శకుస్థాపనకు ఏడాది ముందుగానే రూ. 20 కోట్ల నిధులను మంత్రి దామోదర్ మంజూరు చేయించారు. అయినా, పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ఐదు నెలల్లో కిలోమీటరు పనులు కూడా పూర్తి చేయకపోవడంపై మంత్రి దామోదర్ సీరియస్ అయ్యారని తెలిసింది. కాంట్రాక్టు సంస్థ యాజమాన్యాన్ని పిలిపించి జాప్యంపై ప్రశ్నించినట్లు తెలుస్తున్నది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేయకపోవడం ఏమిటని నిలదీశారని, రెండ్రోజుల్లో పనులను వేగం పుంజుకోకపోతే తప్పుకోవాలని హెచ్చరించారని సమాచారం.

దరఖాస్తుల దందా..!

రాజీవ్ యువ వికాసంకు రూ. 200 వసూలు..

కొందరు మీ సేవ సెంటర్ల నిర్వాకం



మునిపల్లి , ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీవర్గాల నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం కొందరికి కాసులు కురిపిస్తుంది. ఈ పథకానికి ఈ నెల 14లోగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉండగా, కొందరు మీసేవా.. ఆన్‌లైన్ సెంటర్ల నిర్వహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దరఖాస్తులతో పాటు జిరాక్స్, స్కానింగ్‌లు అంటూ వందల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో దరఖాస్తుకు రూ. 200 వరకు వసూలు చేస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఇక ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 45 వసూలు చేయాల్సి ఉండడగా, రూ. 100 వసూలు చేస్తున్నారని అంటున్నారు. దరఖాస్తులకు మరో మూడు రోజుల గడువు మాత్రమే ఉండటంతో వారు అడిగినంత ఇచ్చి దరకాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే సర్టిఫికెట్లకు అధికంగా వసూలు చేస్తున్న మీసేవ, ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆధ్యాత్మిక యాత్రికుడు

కాలినడకన పుణ్యక్షేత్రాలకు
అది వెంకటరమణారెడ్డి ప్రత్యేకత...
పదిమందితో మొదలై.. నేడు వెయ్యి మంది
19 ఏళ్లుగా వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రలు

7

వెల్లువెత్తిన ప్రజాభిప్రాయం

డంపింగ్‌యార్డు ప్రజాభిప్రాయ సేకరణకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

గుమ్మడిదల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : డంపుయార్డుపై ప్రజలందరూ సంఘటితంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు డంపుయార్డ్ ఏర్పాటు ప్రతిపాదనపై గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాభిప్రాయం సేకరించేందుకు నోటీసులు జారీ చేశారు. డంపుయార్డుకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల ప్రజలు తమ వ్యతిరేకతను వినతుల రూపంలో తెలియజేయడానికి శుక్రవారం రెవెన్యూ కార్యాలయానికి వేల సంఖ్యలో తరలివచ్చారు. వీరిని నల్లవల్లి గ్రామ శివారులో ప్రజలను అడ్డుకోవడంతో పోలీసులు ప్రజల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. ప్రజాభిప్రాయం కోరుతూ అధికారులే నోటీసులు ఇచ్చారని, వినతిపత్రాలు అందజేయడానికి వస్తుంటే పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అడ్డంకులను అధిగమించిన గ్రామస్థులు పెద్దఎత్తున తాహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్డీవో రవీందర్‌రెడ్డి సమక్షంలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటుచేసి సిబ్బంది ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇప్పటివరకు 1,190 అర్జీలు నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ పరమేశం తెలిపారు. మరోవైపు డంపుయార్డుకు వ్యతిరేకంగా ప్రజలు 66వ రోజు రిలే దీక్షలు కొనసాగించారు. జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేస్తున్న జేఏసీ నాయకులు



గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్థులు



అణగారినవర్గాల ఆశాజ్యోతి

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సంగారెడ్డిలో ఉన్న ఆయన విగ్రహానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

-సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ పని అయిపోయింది

- పేదల భూములను లాక్కున్న చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీది
- ఎంఐఎంతో బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం
- బీజేపీ ఎదుగుదల ఓర్వలేకనే కేటీఆర్ అబద్దాలు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మెదక్‌లో సభలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పని అయిపోయిందని, దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే ఆ పార్టీ అధికారంలో ఉందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నూతన ఎమ్మెల్సీల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ఎక్కుడుందనే మూర్ఖులకు ఎమ్మెల్సీ ఎన్నికల విజయమే సమాధానమన్నారు. తెలంగాణలోకి బీజేపీని రానివ్వమంటున్న రేవంత్‌రెడ్డి మూర్ఖుడని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ మాట ప్రపంచమంతా వినేస్థాయికి భారత్ ఎదిగిందని కొనియాడారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. దేశంలో అన్ని మతాలు, కులాలకు ఒకే చట్టం తీసుకొస్తామని చెప్పారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్‌ల పేరుతో వేలాది ఎకరాల పేదల భూములను లాక్కున్న చరిత్ర బీఆర్‌ఎస్‌దని రఘునందన్‌రావు ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు భూములు విచ్చలవిడిగా భూములను అమ్ముకొని.. ఇప్పుడు భూములు ఎలా అమ్ముతారని కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో రూ.4.50 లక్షల కోట్ల అప్పులు తెచ్చామని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ఒప్పుకున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో ఎంఐఎంతో బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందంతో కుదుర్చుకొని ఎమ్మెల్సీ ఎన్నికకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కాశీనాథ్, సతీష్‌పటేల్, సత్యనారాయణ, మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి'

నారాయణఖేడ్/కొండాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ప్రాంతంలో వడగళ్లతో కూడిన వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖేడ్ ప్రాంతంలో గురువారం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురియడంతో వందల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రధానంగా కల్హేర్ మండలం బీబీపేట్, ఖానాపూర్, క్రిష్ణాపూర్, మార్డి గ్రామాల్లో వరి నేలకు ఒరిగిందన్నారు. ప్రభుత్వం పొలాలను సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు వడగండ్లతో నష్టపోయిన మామిడి, కూరగాయల రైతులను అదుకోవాలని సీపీఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పండ్ల, కూరగాయల తోటలను సందర్శించి రైతులకు మనోధైర్యాన్ని నింపారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి యువకుడు మృతి


నరేష్(ఫైల్)

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి యువకుడు మృతిచెందిన సంఘటన కోహెడ మండలం శనిగరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి జెరిపోతుల ఎల్లవ్వకు ఐదుగురు కుమారులు. చిన్న కుమారుడు నరేష్(25)కు వివాహం కాకపోవడంతో తల్లితో కలిసి జీవిస్తున్నాడు. వీరికి మేకలు ఉండడంతో రోజులాగే వాటిని నరేష్ మేతకు తీసుకెళ్లాడు. శనిగరం రాజీవ్ రహదారి పక్కనగల 133 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో మేకల కోసం చెట్ల కొమ్మలు కొట్టి చేతితో గుంజుతుండగా పైన ఉన్న హైటెన్షన్ వైర్లకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్ గురై చేతులు, మెడ చుట్టూ తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల రైతులు స్థానిక సబ్‌స్టేషన్‌కు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి చూసేసరికి నరేష్ మృతిచెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోసముద్రం చెరువులో గుర్తు తెలియని శవం లభ్యమైన సంఘటన శుక్రవారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీసి పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఆరెంజ్ డబ్బాల షర్ట్, నల్లని ప్యాంట్ ఉన్నట్లు గుర్తించారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ దొరకడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- మాయమాటలు చెప్తాడు.. నగదు దోచుకుంటాడు
- పలు హత్య కేసుల్లో జైలుకు... విడుదల
- సీసీ కెమెరాల ఆధారంగా దొరికిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఒంటరి మహిళలే టార్గెట్

నర్సాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అతనొక సైకో.... కల్లు దుకాణాలకు వచ్చే ఒంటరి మహిళలే అతని టార్గెట్.. వారికి మాయ మాటలు చెప్పి తీసుకెళ్తాడు. నగదు, నగలు దోచుకుని హత్య చేస్తున్న సైకో కిల్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అయ్యగారిపల్లితండాకు చెందిన కేతావత్ గోపాల్ 2008 నుంచి కల్లు దుకాణాల వద్దకొచ్చే ఒంటరి మహిళలను టార్గెట్ చేయడం పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం జైరాంతండాకు చెందిన బుజిలీ(52) అనే మహిళ మార్చి 25న నర్సాపూర్‌కు వచ్చి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. స్థానిక కల్లు దుకాణం నుంచి ఓ వ్యక్తితో ఆటోలో వెళ్లినట్టు గుర్తించి, వెతకడం ప్రారంభించారు. నాలుగురోజుల తర్వాత నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డు సమీపం పట్టణ శివారులో గిరిజన గురుకుల పాఠశాల దాటిన తర్వాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో కుళ్లిన మృతదేహం లభ్యంకావడంతో.. అది బుజిలీదని కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు డీఎస్పీ, సీఐ, ఎస్ఐతో పాటు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఆటోలో తీసుకెళ్లిన వ్యక్తే హత్యచేసినట్టు గాలింపు చేపట్టారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం కూలీల అడ్డా వద్ద గోపాల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య ఉదయం బయటపడింది. గతంలో వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓ హత్య కేసులో పదేళ్ల శిక్ష కూడా పడింది. జైలు నుంచి వచ్చాక కూడా గోపాల్ ఒంటరి మహిళలకు మాయమాటలు చెప్పి హత్య చేసేవాడని ఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే బుజీలీని హత్య చేశాడని చెప్పారు. కాగా నెలరోజుల క్రితమే సదరు నిందితుడు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో కూడా హత్య కేసులో జైలుకెళ్లి వచ్చాడని చెప్పారు. ఇతడిపై పలు జిల్లాల్లో పది కేసులు ఉన్నాయి. ఒంటరి మహిళల వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు, నగదు కోసమే హత్యచేస్తూ సైకోగా తిరుగుతున్నాడని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

వేర్వేరుచోట్ల ఐదుగురి ఆత్మహత్య

ములుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు మండలం ఆర్అండ్ఆర్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్అండ్ఆర్ కాలనీ మామిడ్యాలకు చెందిన జమాల్పూర్ స్వామి(23) ఈ నెల 4 కడుపు నొప్పి భరించలేక ఎవరికీ చెప్పకుండా నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు ఆర్వీఎం ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, కుమారుడు(3) ఉన్నారు. స్వామి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

చేగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాగాలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మండలం భీమ్‌రావ్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకున్నది. ఎస్ఐ అహ్మద్ మైనుద్దీన్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంగల సిద్ధయ్య(63) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సిద్ధయ్య శుక్రవారం తన వ్యవసాయ పొలం శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నరసమ్మ, కొడుకు నర్సింలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగుడు మానేయమన్నందుకు...

రాయపోల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానేయమని భార్య, కుమారుడు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లికి చెందిన కాకర్ల యాదయ్య(59) మొదటి భార్య మృతిచెందడంతో 25 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు నలుగురు ఆడపిల్లలు కాగా.. అందరి వివాహమైంది. రెండో భార్య ఐలవ్వకు కుమారుడు ఉన్నాడు. యాదయ్య రోజూ మద్యం తాగి ఇంటికొస్తున్నాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో ఆరోగ్యం చెడిపోతుందని భార్య, కుమారుడు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యాదయ్య శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కాకర్ల ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో కృష్ణంరాజు తెలిపారు.



స్వామి(ఫైల్), కొంగల సిద్దయ్య(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

మిరుదొడ్డి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిరుదొడ్డి మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన మోహన్(50) మల్లికార్జునస్వామి ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం విధులకు హాజరై శుక్రవారం అడవిలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక..

చిన్నకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన రేపాక యాదవ్వ, రమేష్ దంపతులకు కుమారుడు రోహిత్(22), ఓ కూతురు ఉన్నారు. రోహిత్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మాస్టర్‌గా పని చేస్తుండేవాడు. తండ్రి, కుమారుడు కుటుంబ అవసరాల నిమిత్తం కొంత అప్పులు చేశారు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రోహిత్ భయాందోళనకు గురవడంతో పాటు, తరచూ మనస్తాపం చెందేవాడు. గురువారం అర్ధరాత్రి ఇంటికి వచ్చిన రోహిత్ ఓ గదిలో పడుకున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి డోర్ తీయడానికి ప్రయత్నించగా తెరచుకోలేదు. చుట్టుపక్కల వారి సాయంతో చూడగా రోహిత్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన రెండు ఇళ్లల్లో చోరీ


బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన బట్టలు

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన రెండిళ్లల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన గుంటి నరసింహ భార్యాపిల్లలతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. అయితే తల్లి లచ్చవ్వకు అరతులం బంగారం బీరువాలో పెట్టి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడంతో చుట్టుపక్కల వారు చూసి నరసింహకు సమాచారమందించారు. అతను వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో బంగారం కనిపించలేదు. అలాగే అదే గ్రామానికి చెందిన బైరి బాలవ్వ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10 వేలను అపహరించుకుపోయారు. బాలవ్వ కుమార్తెలు హైదరాబాద్‌లో ఉండడంతో కొద్దిరోజులుగా ఆమె అక్కడే ఉంటుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్ చోరీ చేసిన సంఘటన కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కొమ్మిడి బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉన్న 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు తోసేసి అందులోని విలువైన రాగి తీగలను తీసుకుని మిగిలిన భాగాలను పొలాల్లో వదలివెళ్లారు. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. 25 కేవీఏలో సుమారు రూ.55 వేల రాగి వైర్ ఉంటుందని ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు. విద్యుత్ అధికారుల సూచనల మేరకు బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దుర్గాభవానీ ఆలయంలో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్‌నాయక్

మునిపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామంలోని దుర్గాభవానీ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి అరకిలో వెండి కిరీటం, రెండు గ్రాముల బంగారు గొలుసులను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పూజారి మడపతి చంద్రమౌళి ఆలయానికి వెళ్లేసరికి అమ్మవారి వద్ద ఉండే వెండి, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ విషయాన్ని గ్రామపెద్దలకు తెలిపాడు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రాజేష్‌నాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న శ్రీరాం

పాపన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశమై పలు జాతీయ కార్యక్రమాల అమలు గురించి వివరాలు అరాతీశారు. ఆయన మాట్లాడుతూ... ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కావడంతో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు రికార్డులు పరిశీలించారు. వైద్యులు హరిప్రసాద్, అన్వర్, సీహెచ్‌వో చందర్, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు


కార్తిక్ రవికిరణ్ దేశ్‌ముఖ్, కమల్ సంజయ్ శిర్షత్

రామచంద్రాపురం/సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. వారికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ వస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్ జడ్జి మెజిస్ట్రేట్ కె.జయంతి శుక్రవారం తీర్పును వెల్లడించారు. మహారాష్ట్ర అమరావతి జిల్లాకు చెందిన కార్తీక్‌రవికిరణ్ దేశ్‌ముఖ్, కమల్ సంజయ్ శిరిషత్ 2023లో విశాఖపట్నం అరకు ఏజెన్సీ నుంచి 125 కిలోల గంజాయిని కారులో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఓఆర్ఆర్‌పై కాపు కాచి వారిని పట్టుకున్నారు. ఈ కేసులో వాదించిన రాజేశ్వర్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారులు కొల్లూరు సీఐలు సంజయ్‌కుమార్, కె.రవీందర్‌తో పాటు కోర్టు కానిస్టేబుల్ సీ.నర్సింహులు, ఏఎస్ఐ బి.రవీందర్‌రెడ్డి నిందితులకు శిక్ష పడటంలో ముఖ్యపాత్ర వహించారని పోలీసులు తెలిపారు.

విద్యార్థికి పాముకాటు


చికిత్స పొందుతున్న విద్యార్థి

పాపన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఒక బాలుడు పాము కాటుకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలుడు(7) ఉదయం పాఠశాలకు వెళ్లాడు. ఇంటర్వెల్ సమయంలో బయట ఆడుకుంటుండగా రక్తపింజర కాటు వేసింది. విద్యార్థి చేతినుంచి రక్తం కారడంతో కేకలు వేస్తూ ఏడవసాగాడు. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన మెదక్ ఆస్పత్రికి తరలించి. ఈ విషయాన్ని డీఈవో రాధాకిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే కలెక్టర్‌కు సమాచారం చేరవేశారు. కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలుడి పరిస్థితి మెరుగ్గానే ఉన్నదని ఉపాధ్యాయులు తెలిపారు.



మెదక్‌లో జ్యోతి బా పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ



చిట్కూల్‌లో కాంగ్రెస్ నాయకులు నీలం మధుదిరాజ్, తదితరులు



మెదక్ కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న రాహుల్‌రాజ్



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఎంపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధి చిట్కూల్‌లో కాంగ్రెస్ నేత నీలం మధుదిరాజ్, మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిలు నివాళులు అర్పించారు.

ఎవరా వృద్ధురాలు..

వివరాలు సేకరిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు కుమారులు ఉన్నా.. 90 ఏళ్ల వయస్సులో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద దిక్కుతోచని స్థితిలో కనిపించిన వృద్ధురాలి వివరాలు సేకరిస్తున్నారు. ఆమెను ఆస్పత్రి వద్ద వదిలి వెళ్లిన వారు ఎవరు అన్న విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సదరు వృద్ధురాలికి సంబంధించిన వివరాలు తెలిస్తే నారాయణఖేడ్ ప్రాజెక్టు కార్యాలయంలో లేదా ఆయా మండలాల సూపర్‌వైజర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. త్వరలోనే వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే అద్దె గృహాల్లోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాప్టాకె సెక్టార్‌లోని మొదటి అంగన్‌వాడీ సెంటర్‌ను అద్దె ఇంట్లోకి మార్చాలని సూచించామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే 9490664020కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సుజాత తెలిపారు.

బాలల కథల పోటీలో ప్రథమ బహుమతి

విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాల సాహిత్య పీఠం వారు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన బాలల కథల పోటీ- 2025లో జక్కుల లోహిత ప్రథమ అందుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జక్కుల లోహిత ఈ ఘనతను సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం లోహితను అభినందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 541 కథలు పోటీకి రాగా, లోహిత రాసిన 'ధూమపానం' కథ ప్రథమ బహుమతి సాధించిందన్నారు. కథలు రాయడంలో ప్రోత్సహించిన తెలుగు భాష ఉపాధ్యాయులు వరికోలి లక్ష్మయ్య, మాచిరాజు బాల సాహిత్య కళాపీఠం బాధ్యులు గరిపల్లి అశోకుడుని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.నాగేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, రమాదేవి, లక్ష్మయ్య, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు సుద్దాల అశోక్‌తేజ శ్రీశూద్ర గంగ కావ్య గానం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) సినీ గేయరచయిత డా. సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీ శూద్ర గంగ కావ్యగానం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి, సీనియర్ జర్నలిస్టు విష్ణుప్రసాద్ తెలిపారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి, తదితరులు హాజరతారని తెలిపారు.

గీతంలో ఔషధాల ఆవిష్కరణపై వర్క్‌షాప్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిత్య మిశ్రా

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం అధునాతన సాంకేతికత (మోల్‌సాఫ్ట్) సాయంతో ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధిపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'మాలిక్యులర్ డాకింగ్, వర్చువల్ స్క్రీనింగ్' పేరిట నిర్వహించిన ఈ ఒక రోజు వర్క్‌షాప్‌లో ప్రధాన శిక్షకులుగా పుణేలోని అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్ అప్లికేషన్ సైంటిస్టులు ఆదిత్య మిశ్రా, డాక్టర్ షంషేర్ సింగ్ సర్దార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్, డాక్టర్ ఎలగందుల సతీష్, డాక్టర్ విన్యాస్ మాయాస, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్డినెన్స్ ఉద్యోగుల నిరసన

కంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలని సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం వద్ద నున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని అన్ని యూనియన్లకు చెందిన ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు తీర్చాలని సోమవారం నుంచి శుక్రవారం వరకు శాంతియుత నిరసనలు తెలిపారు. విధుల్లోకి వచ్చిన ఉద్యోగులు అందరూ ప్రతీ రోజు క్రమం తప్పకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం శివశంకర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆధ్యాత్మిక యాత్రికుడు

కాలినడకన పుణ్యక్షేత్రాలకు..

ఖేడ్ నుంచి కాశీకి పాదయాత్ర

పదిమందితో మొదలై... నేడు వెయ్యి మంది

19 ఏళ్లుగా వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని హంక్రానాకు చెందిన వెంకటరమణారెడ్డి నిరూపిస్తున్నారు. ఆయన పుణ్యక్షేత్రాలకు పాదయాత్ర చేసుకుంటూనే వెళుతున్నారు. పాదయాత్ర చేయడం వల్ల ఆరోగ్యం, ఆధ్యాత్మికభావన పెరుగుతుందని ఆయన అంటున్నారు. 19 ఏళ్లగా దైవదర్శనాలకు పాదయాత్ర చేసుకుంటూనే వెళుతున్నామని వెంకటరమణారెడ్డి అంటున్నారు. తొలిసారిగా ఆయన పాదయాత్రగా 2006లో బయలుదేరగా, ఆయన వెంట పది మంది నడిచారు. ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకోవడం చాలా ఆనందంగా ఉన్నాదని ఆయన అంటున్నారు. ప్రత్యేక వాహనంలో వంటకు అవసరమయిన సరుకులు, పాత్రలు తీసుకెళుతున్నామని, దారిపొడవున దాతలు భోజనాలు, ఫలహారాలు అందించడమే కాకుండా తమకు మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నారని ఆయన చెప్పారు. యాత్రలో ఎవరికైనా ఏమయినా ఆరోగ్యసమస్యలు వస్తే వెంటనే చికిత్స చేయడానికి వారి వెంట పీఎంపీ వైద్యులు ఉన్నారని చెప్పారు. నారాయణఖేడ్ ప్రాంతం కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో వారీకార్ సాంప్రదాయ భక్తులు అధికంగా ఉన్నారు. వెంకటరమణారెడ్డి కూడా వారీకార్ భక్తుడే కావడంతో పండరీపూర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ క్షేత్రాలతో పాటు కాశీ క్షేత్రానికీ పాదయాత్రగా వెళ్లి దర్శించుకోవాలని సంకల్పించుకున్నారు.



పాదయాత్రగా వెళ్తున్న బృందం

ఏటా శివ దీక్ష

2006లో డి.వెంకటరమణారెడ్డి పాదయాత్ర చేసుకుంటూ వెళ్లి శ్రీశైలం మల్లికార్జునుడిని దర్శించుకుందామని దీక్ష చేపట్టిన సమయంలో పదిమంది మిత్రులు తోడైయారు. అదే స్ఫూర్తితో ప్రతీ సంవత్సరం శివదీక్ష చేస్తు శ్రీశైలానికి వందల మంది భక్తులతో కలసి పాదయాత్ర చేసి మల్లన్నను దర్శించుకుంటున్నారు. 2016లో వందమంది భక్తులతో కలిసి కాశీకి పాదయాత్రగా వెళ్లారు. నారాయణఖేడ్ నుంచి కాశీ 1200 కిలో మీటర్ల దూరం ఉంటుంది. రోజుకు 40 కిలోమీటర్ల చొప్పున కాశీకి వెళ్లడానికి 30 రోజుల పాటు పాదయాత్ర చేశారు. తిరుమలకు రెండుసార్లు పాదయాత్రగా వెళ్లారు. ఇటీవల కుక్కలదొడ్డి నుంచి అతికఠినమైన తుంబూర తీర్థం పాదయాత్ర చేసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సంవత్సరం శివరాత్రి సందర్భంగా చేసిన పాదయాత్రలో ఖేడ్ నుంచి 500 మంది భక్తులు పాల్గొనగా, శ్రీశైలం క్షేత్రానికి చేరుకునే వరకు 1000 మందికి చేరుకోవడం విశేషం. వెంకటరమణారెడ్డి బృందం చేసే పాదయాత్రలో పాల్గొని దైవదర్శనం చేసుకోవడానికి నారాయణఖేడ్ ప్రాంతంలోని భక్తులు పోటీ పడతారు. వీరి బృందం ఝరాసంగం సంగమేశ్వర దేవాలయానికి ఐదు సార్లు పాదయాత్ర నిర్వహించింది. వెంకటరమణారెడ్డి తన సొంత భూమిలో శివాలయాన్ని కట్టించారు. అందులో ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా పండరీపూర్‌లో కరణ్‌గజేంద్ర భారతిఆశ్రమం నిర్మాణంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.



పాదయాత్రగా వెళ్తున్న వెంకటరమణారెడ్డి బృందం

అందరి సహకారం వల్లే పాదయాత్ర



భక్తులందరూ సహాయసహకారాలు అందించడం వల్లే మేము 19 సంవత్సరాలుగా పాదయాత్రలతో దైవదర్శనాలకు వెళ్తున్నాం. ఏ క్షేత్రానికి వెళ్లినా రోజుకు దాదాపు 40 కిలోమీటర్ల చొప్పున ప్రయాణం చేస్తున్నాం. మాకు దారి పొడవున దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. భగవంతుడు మాకీ శక్తిని కలిగించడం వల్లే ఈ యాత్రలు చేయగలుగుతున్నాం.

\- వెంకటరమణారెడ్డి

వారికి వైద్య సేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉంది



పాదయాత్రలో దైవదర్శనానికి వెళ్తున్న వారికి ఎవరైనా భక్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే చికిత్స అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ యాత్రల ద్వారా మేము కూడా దైవదర్శనానికి వెళుతున్నాం. మా తోటి వారికి సహాయం చేయడం నిజంగా అదృష్టమని భావిస్తున్నాం.

\- పీఎంపీ వైద్యుడు అమృత్

కఠినమైన పాదయాత్రలతో ఆనందం



దైవ దర్శనాల కోసం పాదయాత్రలు చేయడం కఠినమైనప్పటికీ వందలాది మందితో కలిసి దైవదర్శనాలు చేసుకోవడం ఆనందం కలిగిస్తోంది. నేను వెంకటరమణారెడ్డి బృందంతో కొన్ని పాదయాత్రలకు కలిసి వెళ్లాను. ఆ అనుభూతి మరచిపోలేనిది.

\- రవీందర్‌నాయక్

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ జయంత

ప్రభుత్వ డిగ్రీ, మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా దేశానికి సేవ చేయడంతో పాటుగా ఉజ్వల భవిష్యత్, మంచి ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చని 9 (టీ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ వింగ్‌తో ఇంట్రాక్ట్ యాారు. లెఫ్టినెంట్ కల్నల్ జయంతతోపాటు సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, జీసీఐ శివానీ, సుబేదార్ సూర్యప్రసాద్, పీఐ సిబ్బంది అన్మోల్‌సింగ్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరటం వలన శారీరక ధృడత్వంతోపాటు, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. నవ సమాజ నిర్మాణములో పాలుపంచుకోవడానికి సువర్ణావకాశం లభిస్తుందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికేట్ ద్వారా రాత పరీక్ష లేకుండానే ప్రత్యేక ఎంట్రీ ద్వారా ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలతో పాటు, త్రివిధ సాయుధ దళాలు, అగ్నివీర్ వంటి ఉద్యోగ ఉద్యోగాలు నేరుగా పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సునీత మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి.అయోధ్యరెడ్డి, కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ బి. కృష్ణయ్య, ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.బాలకిషన్, ఎన్‌సీసీ కేడెట్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని 9 (టీ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, జీసీఐ శివాని, సుబేదార్ సూర్యప్రసాద్, హవల్దార్ అమొల్ షిండే సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్యాము, ఎన్‌సీసీ కేర్ టేకర్ డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శ్వేత, డాక్టర్ సువర్ణాదేవి కిషోర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కెడెట్లతో లెఫ్టినెంట్ కల్నల్ జయంత

విధుల్లో చేరేందుకు వస్తే కార్యాలయానికి తాళం

సహకార సంఘం ముందు సీఈవో భోజనం



కొల్చారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): డీజీఓ ఆదేశాల మేరకు విధుల్లో చేరేందుకు వచ్చిన ఓ సీఈవో కార్యాలయానికి తాళం ఉండటంతో బయటే వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు వేచి చూసిన ఆయన అరుబయట భోజనం చేయాల్సి వచ్చింది. వివరాలు ఆయన మాటల్లోనే.. చిన్నఘనాపూర్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేసి విధుల నుంచి తొలగించారని, రెండేళ్ల పాటు కోర్టు చుట్టూ తిరిగితే విధుల్లో చేర్చుకోవాలని జిల్లా అధికారులను కోర్టు ఆదేశించింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సొసైటీకి వెళ్లగా, తాను విధుల్లో చేరేందుకు వస్తున్నానని కొందరు తాళం వేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం వరకు ఆరుబయటే వేచి చూసిన సీఈవో కార్యాలయం ముందే భోజనం చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలను చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాళ్లకల్‌లో నీటి ఎద్దడి

మనోహరాబాద్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నెల రోజుల నుంచి తాగునీరు రావడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరిగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని కార్యదర్శి ప్రియాంకకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కాలనీలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలనీలో కొంతమంది కలిసి రూ. 1,500లకు ఒక ట్యాంకర్ చొప్పున నీరు తెప్పించుకుంటున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళ

తాగునీటి సమస్య రావొద్దు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా అన్నారు. శుక్రవారం జిల్లాలోని డీఎల్‌పీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండుఎండల కారణంగా కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే నీటి సరఫరా కోసం ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

'డబుల్' ఇళ్లలో నిరుపేదలు

కేటాయించక ముందే నివాసం

ఖాళీ చేయాలన్న తహసీల్దార్



చేగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలు కొందరు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనధికారికంగా నివాసం ఉంటుండంతో తహసీల్దార్ శ్రీకాంత్ ఇళ్లు ఖాళీ చేయాలని సూచించారు. మండల కేంద్రంలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించినా ఎవరికీ కేటాయించలేదు. దీంతో కొందరు ఆ ఇళ్లలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసి శుక్రవారం తహసీల్దార్ అక్కడికి వెళ్లి.. వారితో సమావేశమయ్యారు. అనధికారికంగా ఇళ్లలో ఉండకూడదని, వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. తాము అద్దె ఇళ్లలో ఉంటున్నామని, అద్దె కట్టుకోలేని పరిస్థితుల్లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఉంటున్నామని వివరించారు. అర్హులైన తాము దరఖాస్తు చేసుకున్నా ఇళ్లు కేటాయించలేదని, ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తి లేదని భీష్మించుకూర్చున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని, చిన్న చిన్న పనులు ఉన్నాయని వాటిని మరమ్మత్తులు చేసిన తర్వాత త్వరలోనే అందిస్తామని తహసీల్దార్ చెప్పారు. వారంలోగా ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. అయినా, అక్కడి వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వెలిమెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రంగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

రామచంద్రాపురం/మనోహరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. శక్రవారం రామచంద్రాపురం మండల పరిధిలోని వెలిమెలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లపై క్వింటాల్‌కు రూ.2,320 చెల్లించడంతో పాటు అదనంగా మరో రూ.500 చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు రవీందర్ రెడ్డి, సోమిరెడ్డి, దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుపై తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి మనోహరాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దళారుల చేత రైతులు మోసపోవద్దు

కొల్చారం/నర్సాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : దళారుల చేత రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట సహకార సంఘంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. లారీల కొరత వల్ల ధాన్యం ఎండిపోయి వర్షాలతో తడిసి ముద్దయిందని సూచించారు. జిల్లాలో రూ.7 కోట్ల ధాన్యం బకాయి డబ్బులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గౌరీశంకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి ఒకటో వార్షిక మహోత్సవంలో భాగంగా మొదటిరోజు శుక్రవారం రోజు పెద్దమ్మ తల్లి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని శివాయపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ప్యాక్స్ కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు ఉన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుపై భగ్గుమన్న బీఆర్‌ఎస్

- ఆందోళనలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు
- అంబేడ్కర్ విగ్రహం, తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాలు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ, మండల నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం, తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తి గ్రామీణ నేపథ్యం ఉన్న జిన్నారం మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం తగదని, ప్రభుత్వం వెంటనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పూర్తిగా వ్యవసాయ రంగం, ఉపాధిహామీ పథకం అమలు జరుగుతున్న పది గ్రామాలు ఉన్నాయని, గ్రామసభలు నిర్వహించకుండా ఏకపక్షంగా మున్సిపాలిటీ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఎలాంటి ఆదాయ వనరులు లేని పంచాయతీలతో మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటు పడుతుందని, వెంటనే గ్రామ సభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయలు సేకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు మాణిక్‌యాదవ్, రాజేష్, శివరాజ్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణ, జనార్ధన్, ఖదీర్, వెంకటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

రాయికోడ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇటికేపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చేవెళ్ల విఠల్, నాయకులు కొల్లూరు శంకర్, తుకారం, అబేద్మియా పాల్గొన్నారు.

ఎలియన్స్ స్పేస్ స్టేషన్ వద్ద రోడ్డు విస్తరణ చేపట్టండి

రామచంద్రాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఎలియన్స్ స్పేస్‌స్టేషన్ సర్కిల్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ రవిశంకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సీ.ప్రభాకర్‌రెడ్డి(సీపీ రెడ్డి), తూర్పు శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరాజన్ మాట్లాడుతూ సర్కిల్ వద్ద అసంపూర్తిగా రోడ్డు పనులు చేపట్టడం వల్ల నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. భూమిని కోల్పోతున్న యజమానికి పరిహారం చెల్లించి, రోడ్డును విస్తరించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అబ్దుల్ మన్నన్ హెచ్చరించారు. చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామ శివారులోని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది పరిశీలించారు. విలువైన భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా చెట్లను నరికివేసి, భూమిని చదును చేసి ఆక్రమించుకొని భూమి చుట్టూ రాతి కడీలు, కంచె ఏర్పాటు చేశారు. భూమి ఆక్రమనకు గురవుతున్నట్లు కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని అందులోకి ఎవరు వెళ్లవద్దని హెచ్చరించారు.

వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ఐడీఏబొల్లారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వర్షపునీరు రోడ్లపై నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఐడీఏబొల్లారం పట్టణంలో పారిశ్రామికవాడతో పాటు గ్రామంలో వివిధ ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీటిని దారి మళ్లించేందుకు అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. అలానే మల్లంపేట శివారు ప్రాంతంలోని కాలనీల్లోకి చేరిన మల్లంపేట, దుండిగల్, బాచుపల్లి ప్రాంతాల మురుగు వరదలా ప్రవహించడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేటట్టు చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌నాయక్‌కు ఫోన్ ద్వారా అభ్యర్థించారు.

ప్రధాని ఇంటర్న్‌షిప్ ద్వారా స్వయం ఉపాధి

- జిల్లా పరిశ్రమ కేంద్రం జీఎం ప్రకాష్



స్వయం ఉపాధి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం

నర్సాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువత వివిధ కారణాలతో చదువును మధ్యలోనే ఆపేసి ఉపాధి లేదని కృంగిపోతున్నారని అటువంటి వారికోసం కేంద్ర ప్రభుత్వం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిపొందేవిధంగా సహకరిస్తుందని మెదక్ జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్వయం ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు 21-24 మధ్య వయసు ఉండి కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగం లేని పదోతరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో లబ్ధిపొందడానికి పరిశ్రమల కేంద్రాన్ని సందర్శిస్తే వారికి అన్నివిధాలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సమీరా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా



అమ్మకానికి ఉంచిన చేనేత వస్త్రాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళా మేళా ప్రజలను ఆకట్టుకుంటున్నది. అంతరించిపోతున్న హస్తకళలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ మేళాలో హస్తకళా ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తుండగా, కళాకారులచే నేరుగా విక్రయిస్తున్నారు. అఖిల భారత హస్త కళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ మేళా ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నది.

150 ఫీట్లకు తగ్గకుండా రోడ్డును విస్తరించాలి

అమీన్‌పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా విస్తరిస్తున్న అమీన్‌పూర్-చందానగర్ రోడ్డును 150 ఫీట్లకు తగ్గకుండా విస్తరించాలని కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి వినపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంజూరైన రోడ్డు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు తిరుమల్‌రెడ్డి, వెంకటకృష్ణ, రఘు, పుల్లారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శం

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందడుగు వేయాలని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సామాజిక అంతరాలపై సాహసోపేతమైన పోరాటాలు చేసిన జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు అనేక ఉద్యమాలకు ఊపిరి పోసిందన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



పటాన్‌చెరు : మహాత్మా పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్: క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో తదితరులు



చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

న్యూస్ బాక్స్

చెరువులో పడి పశువుల కాపరి మృతి

కొల్చారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి పశువుల కాపరి మృతిచెందాడు. కొల్చారం మండలం చిన్నఘనపూర్‌కు చెందిన పోతుగోని రామాగౌడ్(22) గురువారం పశువులను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. కుటుంబసభ్యులు రాత్రంగా వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున పెద్ద చెరువులో శవమై తేలాడు. తండ్రి ఆగంగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు పోస్టు మార్టం తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తెల్లాపూర్‌లో 8.0ఎంవీఏ పీటీఆర్‌ను అమర్చుట కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు 33/11 కేవీ ఎంఐజీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే అన్ని ఫీడర్లకు విద్యుత్‌సరఫరా తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వీటిలో ఓల్డ్ ఎంఐజీ, న్యూఎంఐజీ, ఇంద్రానగర్, అంబేద్కర్ కాలనీ, జ్యోతిరావు పూలే కాలనీ, కొమురం భీం కాలనీ, తెల్లాపూర్, బోన్ సాయి, హుడా కాలనీ, మైఫేర్ పూర్తిగా విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ తెలిపారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు రైల్వే లైన్‌కు ఒకవైపు ఎంఐజీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ స్పష్టం చేశారు. 33/11 ఉస్మాన్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ ఫీడర్‌కు సంబంధించిన ప్రాంతాల్లో 2:30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కందిలో..

కంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదరి విస్తరణ పనుల కోసం నేడు (శనివారం) కందిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రకాశ్ తెలిపారు. ఇందుకోసం 11కేవీ బాలజీ ఫీడర్ ఎల్‌సీ తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. కందిలోని సాయి కాలనీ, గేట్ వే, విజ్ఞాన్ కాలనీ, శ్రీనిధి ఎన్‌క్లేవ్, మంజీరా ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండనున్నదని శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

చౌటకూర్ తహసీల్దార్‌గా అనుదీప్

పుల్‌కల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ తహసీల్దార్‌గా అనుదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీటీసీఎస్ నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్‌కు చౌటకూర్ తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

కల్హేర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి అన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపుమేరకు 'గావ్ చలే అభియాన్'లో భాగంగా కల్హేర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగానికి రక్ష

కల్హేర్/పెద్దశంకరంపేట/చేగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోచయ్య, మాజీ ఎంపీపీ మల్లేశం అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్(కె)లో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమ ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. పెద్దశంకరంపేట మండలంలోని మల్కాపూర్, బద్దారం, గొట్టిముక్కుల గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. చేగుంట మండలం నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండాలో అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి చిత్రపటాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

ఆర్డీవో తనిఖీ

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నాగల్‌గిద్ద తహసీల్దార్ కార్యాలయాన్ని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

వట్‌పల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు, ఖర్చుల వివరాను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వేసవికాలం ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజయ్య, ఎంపీవో క్వాజా నసిరుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ దశరథ్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరం

కంది/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరమని మెడికల్ ఆఫీసర్ సాయిశంకర్ అన్నారు. కంది మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షంలో భాగంగా బాలింతలు కిశోర బాలలకు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, సిబ్బంది లావణ్య, ఏఎన్‌ఎంలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 లోని గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యం పట్ల సూచనలు కల్పించారు.

ఆట పాటలతో అలరించిన చిన్నారులు



సంగారెడ్డి రాజంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవానికి హాజరైన డీడబ్ల్యూవో లలితకుమారి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వార్షికోత్సవంలో భాగంగా సంగారెడ్డి రాజంపేటలో గల ఎస్సీ, బీసీ కాలనీ, ఇందిరా కాలనీ, రాంచంద్రారెడ్డి కాలనీ, విజయనగర్ కాలనీల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులు ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీడబ్ల్యూవో లలితకుమారి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యాలను బాల్యం నుంచే కాపాడేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, అజీమ్ ఫౌండేషన్ ప్రతినిధి అఖిల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో వర్క్‌షాప్

పుల్‌కల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎస్టీసీ 2025 పేరుతో వర్క్‌షాప్‌ను కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ జీ.నరసింహ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మునిసిపల్ పరిమిషన్స్, ప్లానింగ్ ఎలా ఉంటాయో తెలియజేశారు. అర్బన్, రూరల్ ఏరియా, హైడ్రాతో పాటు వివిధ విధానాలపై విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తమ సొంతంగా ఎలా స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేయడానికి గల విధివిధానాలు, వాటితో వచ్చే లాభాలు, ఎదురయ్యే సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, సివిల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి బి.సునీత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి'

నారాయణఖేడ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలం అబ్బెందలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భీమ్‌ఆర్మీ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనుముల తుకారంతో పాటు వివిధ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించి, మాట్లాడారు. బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు కారణమైన నిందితులను శిక్షించాలన్నారు.

ధర్మాన్ని పాటిద్దాం.. భగవంతుడిని స్మరిద్దాం

రేగోడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మాన్ని పాటిస్తూ, భగవంతుని స్మరించుకుంటే పుణ్యఫలం దొరుకుతుందని దుద్యాల సర్వేశ్వరపురం పీఠాధిపతి అంబికా శివయోగి అన్నారు. రేగోడు హనుమాన్ ఆలయం విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా రెండోరోజు శుక్రవారం పుష్పాదివాసము, హోమం, తీర్థప్రసాదాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంబికా శివయోగి ప్రత్యేక పూజలు చేసి ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరు వారు చేసిన పాపపుణ్యాల ఫలంగానే జీవితాన్ని అనుభవించాల్సి ఉంటుందని అన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ(ఏ)లో చేర్చాలి'

జహీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌లను బీసీ(డి) నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పట్లోళ్ల గోపాల్‌ముదిరాజ్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన ఆంజనేయులు, ఆకాష్, గోపాల్ ఉద్యోగాలు సాధించగా.. వెంకటరాములుకు ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో వారిని సంఘం నాయకులు శుక్రవారం ఆదర్శనగర్‌లో ఘనంగ సన్మానించారు.

గురుకుల పాఠశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్

జిన్నారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలలో శ్రేష్ఠభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా ఏక్ భారత్, శ్రేష్ఠభారత్ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, గీతాలపాన, ఫ్యాన్సీ డ్రెస్ షో, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

అల్లీనగర్‌లో అక్రమ కట్టడం కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చివేయిస్తున్న దృశ్యం

జిన్నారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం గడ్డపోతారం మున్సిపాలిటీ అల్లీనగర్ 27 సర్వే నెంబరులో నిర్మించిన కట్టడాన్ని ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ తెలిపారు.

'సర్వీస్ రోడ్డును నిర్మించాలి'

జహీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయం వెళ్లే బైపాస్ రోడ్డు వద్ద సర్వీస్‌రోడ్డుతో పాటు, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించాలని బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) జాతీయ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి శుక్రవారం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి నాగ్‌పూర్‌లో వినతిపత్రం అందజేశారు.